పూర్తిగా మసిచేసి సమస్త సంబంధాలు తెంపుకొని వెళ్ళిపోయిందాకా కాచుక్కూర్చుని కనీసం అతని అస్థికలైనా జ్ఞాపకార్థంగా తీసుకుపోదామని వచ్చాను" ఆమె చెప్పడం ఆపేసింది.

నిప్పులు చల్లారిపోయాయి వేగుచుక్క పొడిచింది. తీతువుపిట్ట కెవ్వున అరుస్తూ పైన రెండు సార్లు తిరిగిపోయింది.

ప్రభాకరరావు ఆమెకు జడ్జిమెంటు ఏమిస్తాడోనని చెవులు రిక్కించుకొని ఎదురు చూడసాగాను.

"ప్చ్" చప్పరించాడు "అతను మీ ప్రేమకు అర్హుడు కాడేమోనండి" అన్నాడు.

ఆమె అందుకుని "ఆ విషయం మీకు తెలీదులెండి" అంది. స్మశానపు అవతలనుంచి ఎడ్ల మెళ్ళో గంటలు వినిపించాయి. బండి ఇటే వస్తుందన్న మాట. తెల్లవారిపోయినట్లే!

"తెల్లవారిపోయింది. వెళదాం వస్తారా" అన్నాడు ప్రభాకరం.

"వెళ్లక ఏంచెయ్యగలం? ఆడవాళ్ళు ఏవేవో చెయ్యాలనుకొని ఏమీచెయ్యలేక చిట్టచివరికి ఆడవాళ్లుగానే వుండిపోతారు" అంటూ గుప్పెడు బూడిద చెంగున కట్టుకులేచి నిలబడింది.

నాకు ఈ రాత్రి ఎలాగో గడచిపోయిందన్న సంతృప్తికంటే ఈ పాపిష్టి శ్రవణాలతో విన్న మానవ కథనం వారంరోజులవరకూ జాగరం చేయించగలగడానికి హేతువయిందేనన్న బాధ ఎక్కువగా పీడిస్తోంది.

స్కెచ్

# లాభనష్టాలు

"హితశ్రీ"

"ఆనందరావ్!"

వెనక్కి తిరిగిచూశాడు ఆనందరావు. గబగబ అడుగులేసుకుంటూ రామనాథం తనవైపే వొస్తూండటం చూసి మర్యాదకోసం అతనుకూడా రామనాథం వైపు నడిచాడు. ఇద్దరూ కలుసుకోగానే మళ్ళీ నడక ముందుకి సాగింది.

"ఎక్కడిదాకా?"

"మీటింగుకి."

"నేనూ అక్కడికే, పద."

జరగబోయే మీటింగుని గురించీ, మాట్లాడబోయే వ్యక్తుల్ని గురించీ సంభాషణ కాసేపు జరిగి ఆగిపోయింది. రామనాథం ఓ చిన్న దగ్గు దగ్గి కొంచం వేదాంత ధోరణిలో భవబంధాల్ని గురించి ముచ్చటించి విరక్తిగా అన్నాడు.

"ఏమిటోనోయ్, ఈ సంసారపు గొడవల్తో మహా బాధగా ఉంది."

అందులో అసహజమేమీలేదని ఒప్పుకున్నాడు ఆనందరావు. కాసేపు ఊరుకుని రామనాథం అకస్మాత్తుగా అడిగాడు.

"ఎప్పుడైనా ఆలోచించావూ?"

"ఏమిటి?"

"డబ్బులేకపోతే మనం ఏవిధంగానైనా చలామణీ కాగలమంటావా?"

"ఎబ్బే!" అన్నాడు ఆనందరావు-రామనాథం ప్రశ్నలోనే అందించిన సమాధానం గ్రహించి.

"ఎందుకోయ్, వెధవజీవితం."

"ఏం అంతవిరక్తిగా ఉన్నావ్?"

"వెధవడబ్బు."

"ఏమయిందేమిటి?"

"ఇంకా ఏమీకాలేదులే."

"ఏమైనా కాబోతోందా?"

"ఒకటేమిటి, లక్ష కాబోతున్నాయి. ఏం చేస్తాం?"

తరవాత రామనాథం ఇంకేమీ మాట్లాడలేదు - కాబోయే విషయాన్ని గురించి. వినే ఓపికా, ఇష్టమూకూడాలేని ఆనందరావు లోలోపల కొంత సంతోషించి, ఎందుకైనా మంచిదని ఓ సిగరెట్ ముందుగానే రామనాథంకి బహూకరించి తనూ ఒకటి స్వీకరించాడు. కాసేపు సిగరెట్ పొగలో నిమగ్నుడై నిశ్శబ్దాన్ని పాటించి రామ

నాథం మళ్ళీ పూర్వసంభాషణ కొనసాగించాడు.

"అంతా డబ్బులో ఉందోయ్."

"నిజమే."

"బంధుత్వమేమిటి, స్నేహమేమిటి—డబ్బు లేకపోతే ఏదీలేదు."

సమాధానం చెప్పకపోవటంలోనే మేలుందని ఆనందరావు మాట్లాడకుండా ఊరుకున్నాడు.

"నిన్నటినించీ ఓ ఇరవై రూపాయలకోసం కాళ్ళరిగిపోయేట్టు తిరిగాను."

ఆనందరావుకి వున్నట్టుండి గుండె గుబుక్కుమంది.

"ఒక్కళ్ళూ ఇచ్చినపాపానపోతేనా-! ప్చ్"

ఆనందరావుకి ముఖం కొంచెం ముకుళించింది. తరవాత రామనాథంనోటినుంచి వెలువడబోయేదేమిటో తనకి తెలుసు!

"ఇహ నువ్వొక్కడివే మిగిలావు."

పడ్డది పిడుగు!

ఇంత ఉపోద్ఘాతంతో మొదలైన ఈ అప్పు దరఖాస్తుని వెంటనే ఠకీమని ఎర్రపెన్సిల్‌తో కొట్టేసినట్టు కొట్టేయటానికి వీల్లేని పరిస్థితిలో పడ్డాడు. వెంటనే జవాబేమీ చెప్పలేదతను.

రామనాథం నిరీక్షిస్తున్నాడు—ఇంకా 'సారీ' వినపడలేదేమా అని.

"నువ్విప్వకపోతే చాలా చిక్కుల్లో పడతానోయ్, ఆనందరావ్."

ఇస్తే తనూ చిక్కుల్లో పడతానని వెంటనే అనిపించింది ఆనందరావుకి.

"ఏ విధమైన చిక్కు?" అని రామనాథం అడిగితే మరో చిక్కు వెంటనే ఏర్పడుతుందని ఆలోచించి అలా అనటం మానుకున్నాడు.

పోనీ, ఇస్తే—

చస్తే మళ్ళీ తిరిగి రాదనే గాఢనమ్మకం తనకి కొందరు మిత్రులు రామనాథం గురించి చెప్పిన విషయాలవల్ల ఏర్పడ్డది.

ఆలోచించి చివరికి "క్ష మిం చా లో య్?" అన్నాడు ఆనందరావు.

"లేదా?"

"ఉంటే, ఇవ్వనూ?"

"ఇవ్వాలనుకుంటే,ఆమాత్రంఉండదుటోయ్?"

"ఎక్కడిదీ?"

"లేదంటావా?"

"సారీ."

"ఇవ్వటం ఇష్టంలేదు. అంతేగా?"

"లేదోయ్"అన్నాడు ఆనందరావు మనసులో కొంచెం కష్టపడుతూనే. అతనికి అబద్ధం చెప్పటం అంత ఇష్టమైన విషయంకాదు. కాని చూస్తూ ఇరవై రూపాయలు నష్టపోయేటంత పిచ్చిపని ఎలా చేస్తాడు? తనుమాత్రం ధనికుడా? ఏదో సరిపెట్టుకుంటూ నాలుగు డబ్బులు వేనకేసుకొస్తున్నాడేగాని, దయా ధర్మంగా వెదజల్లేటంత ఎక్కడుంది తనకి?

"అలాగే అంటావనుకున్నాలే. ఏమిటో, వెధవ ప్రపంచం" తనలోతను అనుకున్నట్టుగా అన్నాడు రామనాథం.

"వెరీసారీ.ఇవ్వలేకపోయినందుకు క్షమించు"

"నేనంటే అంత భయమెందుకోయ్?"

"భయమెందుకు?"

"ఎగేస్తాననేగా? కావాలంటే నోటురాసిస్తా ఓ నెలలో ఇస్తానని వాగ్దానంకూడా చేస్తున్నా. ఏం?"

ఆనందరావు మాట్లాడలేదు.

"ఇంకా భయమే?"

"అదికాదోయ్..."

"లేకపోతే, దగ్గర ఉండీ కూడా లేదని ఎందుకంటావు?"

ఆనందరావు అదిరిపడి రామనాథంవైపు చూశాడు.

"ఎబ్బే..."

"అబద్ధం ఎందుకులే. కొన్ని నిముషాలకిందటే సుబ్బారావు కనపడి చెప్పాడు. నీకివ్వాలిసిన బాకీ పాతిక రూపాయలు ఇప్పుడే ఇచ్చివేశాడనీ, తన దగ్గిరేమీ లేదనీ."

ఓ క్షణం ఆగి ఆనందరావు నసిగి అన్నాడు.

"లేదంటే-అసలు లేదనికాదు. అవసరాలకి మించినంత లేదని నా అభిప్రాయం. మాటింగునించి బజారు కెళ్లాలిసిన పనుంది. లేకపోతే, లేదని ఎందుకంటానూ?"

రామనాథం ఓ చిరునవ్వు నవ్వాడు. ఆనందరావది గమనించాడు. అతనికి ఒళ్లు మండింది.

"నీకెందు కివ్వాలి?" అని దబాయించా లనిపించింది. కాని తమాయించుకున్నాడు. అంతవరకూ బయటికి లేదనే అంటున్నా లోపల ఆలోచిస్తున్నాడు. ఒకవేళ ఇచ్చిసా నెలజీతం రాగానే గొంతుమీద కూచుని తను రాబట్టుకోగలడనే ధైర్యం కొంతఉంది. కాని రామనాథం వైఖరి చూసి ఆలోచన వెంటనే వొదిలేశాడు.

ఇద్దరూ మీటింగుకెళ్ళారు. జనం తొక్కిళ్ళాడుతూ ఉన్నారు. ఇద్దరూ లోపలికి తోసుకెళ్ళి ముందుకు వెళ్ళారు. ఒచ్చినజనం వెళ్ళేజనం హడావిడిగా ఉంది.

ఆనందరావుకి హఠాత్తుగా తనపర్సు విషయం జ్ఞాపకంవొచ్చింది చూసుకున్నాడు. లేదు. గుండె పగిలింది. గాబరాపడుతూ అన్నాడు "పర్స్... పర్స్ పోయింది. రామనాథం...నాపర్స్ ఎవరో కొట్టేశారు."

రామనాథానికి తనపర్స్ విషయం జ్ఞాపకం వొచ్చింది వెంటనే జేబు చూసుకున్నాడు. ఖాళీ. ఉన్న రెండురూపాయలూ తప్పించుకున్నాయి. మనస్సు చివుక్కుమం దతనికి.

"ఆనందరావ్, నా పర్సుకూడా కొట్టేశారు. బుద్ధిగడ్డితిని ఇక్కడికొచ్చాం అజాగ్రత్తపరులం"

ఆనందరావు నిట్టూర్పు విడిచాడు.

రామనాథంకూడా ఉస్సురన్నాడు.

జనం వీళ్ళిద్దరిచుట్టూ మూగారు. "ఎంతండీ పోయింది - పాతికా, అబ్బా... రెండేనా... పోన్లెండి ఇంకానయం. జేబులుకొట్టటం ఎక్కువైపోయిందండి...నిన్నటికి నిన్నా..."

ఎవరి ఇష్టంవొచ్చినట్టు వాళ్ళు మాట్లాడుతున్నారు.

ఆనందరావు అవస్థ చెప్పటానికి వీల్లేకుండా ఉంది. తను వొట్టి బుద్ధిహీనుడూ, దురదృష్టవంతుడూ. అంతడబ్బు జేబులోపెట్టుకుని జనంలోకి రావటమేమిటి? ఈ ఆలోచనలలో ఆనందరావుకోవిషయం జ్ఞాపకంవొచ్చింది. ఛీ! వెధవ మనసు. అనవసరంగాయోచించాడు. రామనాథం అంత బతిమాలినా తనెందుకు ఇవ్వలేదు?

పోయింది రెండురూపాయలే ఐనా రామనాథంకూడా ఎక్కువగానే బాధ పడసాగాడు. అయితే ఆ ఆలోచనలలో అతనికోఊహ చప్పున తట్టింది. రామనాథం ఓసారి బుజాలెగరేసి బుర్ర తడుముకున్నాడు. ఇంకానయం! తనంతగా బతిమాలినా ఆనందరావు తనకప్పివ్వలేదు.

ఆదేసమయాన ఆనందరావు, రామనాథాలు ఒకరివైపొకరు చూసివెంటనేతలదించేసుకున్నారు.

---

# మానవజాతి విశిష్టలక్షణాలు

డాక్టర్. సి. యమ్. జోడ్

జగత్తులో కనబడుతున్న జీవరాసుల్లో ఒక తెగకు మరొకతెగకూ మధ్య, ఉనికికోరకు ఉపయోగించే దమనరీతుల్లోనూ, శరీరయాత్ర కొనసాగించేందుకు అనుసరించే పంథాల్లోనూ ఎంతో తారతమ్యం వుంది. అసలు సృష్టి విధానంలోనే ఒక జీవరాసికీ మరొకదానికి ఎన్నో విషయాల్లో భేధం, గొప్ప చెడు అంతస్థులూ నియమించబడ్డాయని చాలమంది అభిప్రాయం. కాని ప్రతి జీవరాసికీ, దాని శీలంలో ఇమిడివున్న సహజగుణాల్ని పెంపొందించుకొనే అభివృద్ధి హక్కు వున్నదని తలుస్తాం. తెలివిగల తోటమాలి తను నాటే మొక్కను, దాని సహజమైన అభివృద్ధిపొందే గుణాల్ని పెరిగేట్టు చూస్తాడు గాని, కొత్త వింతగుణాల్ని దానిలోచేర్చి, పెరిగేట్టు చేయడు. ఈ విషయంలో తోటమాలి రెండుపనులు ముఖ్యంగా గుర్తుంచుకొంటాడు. మొదటిది మొక్క, లేక చెట్టును వంగిపోయి, కృశించి పోకుండా కష్టపడతాడు చూస్తాడు. రెండోది దాని అభివృద్ధిని సరైన విధానంలో జరిగేందుకు ప్రోత్సహిస్తాడు. ఈ విధానంనే మానవవ్యక్తిత్వానికీ అనుసరించాల్సిన అవసరం వుంది. వ్యక్తిలోని గొప్ప, సుజ్ఞాన సంపదను